క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో పుస్తకపఠనం చేయిస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): పుస్తకపఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని చీపురుపల్లికి చెందిన ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు.గరివిడి మండలంలోని బాగువలస గ్రామంలో ఆశయ రూరల్ లైబ్రరీ సేవలను విద్యార్థులకు శనివారం అందించారు. పుస్తకపఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, వారితో పుస్తకపఠనం చేయించారు.విద్యార్థులు మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేయకుండా పుస్తక పఠనం చేయాలని, తల్లిదండ్రులు కూడా దీన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు.

చిరస్మరణీయుడు సుబ్రహ్మణ్య తిలక్



తిలక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

విజయనగరం: స్వాతంత్ర సమరయోధుడు, భారత మొదటి పార్లమెంటేరియన్ కందాళ సుబ్రహ్మణ్య తిలక్ చిరస్మరణీయులని సీనియర్ న్యాయవాది ఫోర్.ఎస్.రాజు అన్నారు. పట్టణంలోని ఉడా కాలనీలో ఉన్న తిలక్ ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం తిలక్ ఐదో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఫౌండేషన్ ప్రతినిధులు సుబ్రమణ్య తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఫోర్.ఎస్.రాజు మాట్లాడుతూ తిలక్ అభ్యుదయ భావాలు కలిగిన వారని, ఆయన బ్రాహ్మణుడైనప్పటికీ దళిత సంక్షేమానికి, దళిత విద్యార్థుల చదువులకు ప్రాధాన్యత ఇచ్చి తన సొంత ధనాన్ని ఖర్చు చేశారని గుర్తుచేశారు. దళిత యువత ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాల సముపార్జనకు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు పని చేసిన మొదటి వ్యక్తి తిలక్ అని కొనియాడార. సోషలిస్ట్ భావాలు కలిగిన తిలక్‌ను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిలక్ ఫౌండేషన్ కార్యదర్శి గురుస్వామి కందాళ సాయిబాబా, వాకర్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ కొత్తలి ఎర్రినాయుడు, సీతారామచంద్ర వర్మ, కే.వి.రామకృష్ణ, కొల్లి సత్యం, కందాళ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

13న కామాక్షమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: పట్టణంలోని బొండాడవీధిలో ఉన్న మహాగణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామివారి ఆలయ పంచమ వార్షి కోత్సవాన్ని జ్యేష్ఠ శుద్ధ సప్తమి సందర్భంగా గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 13న ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ, కలశస్థాపన, అర్చన, భూపుర శ్రీచక్ర అలంకరణ, దేవి దేవతా మూర్తుల ఆవాహణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 9 గంటలకు మూలమూర్తులకు ప్రత్యేక వస్త్రాభరణాల అలంకరణ, 10 గంటలకు సువాసినితో శ్రీచక్ర సహస్ర కుంకుమార్చన, లలితా పారాయణం నిర్వహిస్తామన్నారు. హరే శ్రీనివాస్ బృందం వారిచే సాయంత్రం కోలాట కార్యక్రమము, 6 గంటలకు కామాక్షి దేవి ఏకాంబరేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా చేపట్టనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి తెలిపారు. అలాగే అమ్మవారిని 108 చీరలతో అలంకరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఫణి మాధవికి కవితా పురస్కారం

విజయనగరం టౌన్: ఖమ్మంకి చెందిన ఫణి మాధవి కన్నోజుకు డాక్టర్ రాధేయ కవితా పురస్కార ప్రదానోత్సవం గురజాడ కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లాశాఖ ప్రతినిధి చీకటి దివాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంటేడ గౌరునాయుడు, ఆత్మీయ అతిథులుగా అట్టాడ అప్పలనాయుడు, బండి సత్యనారాయణ, అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ సుంకర గోపాల్, పెళ్లూరు సునీల్, దోర్నాదుల సిద్ధార్థలు హాజరుకానున్నారన్నారు. సాహితీ మిత్రులందరూ హాజరుకావాలని కోరారు.

మేనిఫెస్టో అమలు చేసి
మన్ననలు పొందాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- తమకంటే ఎక్కువ సంక్షేమం, మెరుగైన పాలనఅందిస్తామని చెప్పడంతో ప్రజలు కూటమికి పట్టంగట్టారు
- తాము ప్రారంభించి, మిగిలిపోయిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలి
- గజపతినగరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి హామీలు ఇచ్చిందని, ఇప్పుడు వారు అధికారంలోకి వచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, మేనిఫెస్టోను అమలు చేయాలని గజపతినగరం వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యా లయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గజపతినగరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొండపల్లి శ్రీనివాస్‌కు శుభా కాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేసిందని, నియోజ కవర్గంలో రోడ్లు వేయడం, పాఠశాలలను అభి వృద్ధి చేయడంలో, ఇంటింటికీ తాగునీరు అందించడంలో కానీ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటిముంగిటకే అందించడంలో పూర్తిస్థాయిలో తాము పని చేశామని చెప్పారు. ఎవరు అధికారంలో ఉన్నా ప్రజలకు మంచి జరగాలన్నదే తమ అభిమతమని అన్నారు. తాము ప్రారంభించి, మధ్యలో ఉండిపోయిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, గజపతినగరంలో వంద పడకల ఆస్పత్రి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

దాడులు, దౌర్జన్యాలు తగవు

అధింకారంలోకి వచ్చామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు దిగడం సరికాదని అప్పలనరసయ్య అన్నారు. విజయనగరం జిల్లాలో గత అయిదేళ్లలో ఎలాంటి రాజకీయ హింసాత్మక ఘటనలు జరగలేదని, శాంతియుత పరిపాలన సాగించామే తప్ప గ్రామాల్లో దౌర్జన్యాలు, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పనులు ఏనాడూ చేయలేదని చెప్పారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేశామన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేసి ప్రజల మద్దతు పొందాలని, హింసకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెడితే వారి పక్షాన పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో అప్పలనరసయ్య తనయుడు సాయిగురునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, నాయకులు రెడ్డి పద్మావతి, కరణం ఆదినారాయణ, మండల సురేష్, కె.సుబ్రహ్మణ్యం,మంత్రి నరసింగరావు, కంది తిరుపతినాయుడు, సర్పంచ్ నరవ కొండమ్మ, కర్రి రామునాయుడు, కె.పైడిపునాయుడు, ఇనుముల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



గణపతిస్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో కార్యసిద్ధి గణపతి ఆలయం వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహిం చారు. అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ, విష్ణుశర్మ స్వామివారికి స్నపన తిరుమంజనం, పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణానికి పందిరిరాట



పందిరి రాట వేస్తున్న మహిళలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

జామి: భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిం చనున్నారు. అందులో భాగంగానే స్వామివారి కల్యాణానికి ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో శనివారం పందిరిరాట వేశారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోండి

చీపురుపల్లి: ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని స్థానిక జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకు నేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయని, ప్రవేశాలకు విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. స్థానిక కళాశాలలో నూతన భవనాలు, ల్యాబ్ సదుపాయం, నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నట్లు స్పష్టం చేశారు. గతేడాది ఇదే కళాశాల నుంచి కోర్సులు పూర్తి చేసుకుని రిలీవ్ అయిన 78 మంది చక్కని ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. విద్యార్థులు చీపురుపల్లి కళాశాలను వెబ్ ఆప్షన్‌లో నమోదు చేసుకుని చక్కని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని పేర్కొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

శృంగవరపుకోట: మెరుగైన దిగుబడుల కోసం నవధాన్యాలు నాటండి అంటూ మండల వ్యవసాయ శాఖ ఉద్యోగులు గ్రామాల్లో రైతులకు విస్తృతంగా ప్రచారం చేస్తూ విత్తనాలు అందిస్తున్నారు. నవధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను మండలంలోని సంతగవిరమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో రైతులకు ఏఓ రవీంద్ర తన సిబ్బందితో కలిసి శనివారం అవగాహన కల్పించారు. అనంతరం నవధా న్యాల కిట్లు రైతులకు పంపిణీ చేశారు. వరిసాగు చేయాలనుకునే పొలాల్లో రైతులు తమకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇచ్చిన పచ్చి రొట్ట విత్తనాలు జనుము, జీలుగ, పిల్లిపెసరే కాకుండా వారి వద్ద ఉన్న ఉలవలు, మినుములు, పెసర, కందులు, ఆకుకూరల విత్తనాలను కూడా చల్లుకుంటే వరి పైరుకు కావాల్సిన పోషకాలతో భూమి సిద్ధమవుతుందన్నారు. వీఏఏ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోటి బాబు, మల్లేష్‌నాయుడు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సర్వసాధారణం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయామని అధైర్యపడాల్సిన పనిలేదని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గజపతినగరం,దత్తిరాజేరు మండలాల పార్టీ నాయకులు, కార్య కర్తలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా మనది ఎప్పుడూ ప్రజాపక్షమేనని అన్నారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు పట్టం గట్టారని, వారు ఇచ్చిన హామీలను అమలు చేస్తారా లేదా అన్నది వేచి చూడాలని, ఆ పార్టీల కార్యకర్తలు రెచ్చగొట్టినా, తగాదాలకు దిగకుండా సంయమనంతో ఉండాలని సూచించారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అయలు చేయకపోయినా, ప్రజా సమస్యలు పరిష్కరించకపోయినా ప్రజల తరపున పోరాడదామన్నారు. నాయకులు బొత్స సాయి గురునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు మంత్రి అప్పలనాయుడు, బెల్లాన త్రినాథరావు, ఎం.సురేష్,ఎం.రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బంగారు 'భవిత'



దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చేపడుతున్న సమగ్రశిక్ష, విద్యాశాఖ సిబ్బంది

పూసపాటిరేగ: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో భవిత కేంద్రాలు సేవలందిస్తున్నాయి. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో పిల్లలకు విద్యతో పాటు ఫిజియోథెరపీ, ఇతర సేవలను అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు భవిత కేంద్రాలు బాటలు వేస్తున్నాయి. ఇతర పిల్లలతో వారిని వేరుచేసి చూడకుండా అందరినీ ఒకే పాఠశాలలో చేర్పించి విద్యనందిస్తున్నారు. ఇందులో భాగంగా సమీప భవిత కేంద్రాలతో ప్రాథమిక పాఠశాలలను అనుసంధానించారు. సాధారణ పిల్లలతో పాటు కలిసి చదువుకోవడం ద్వారా దివ్యాంగులమనే భావాన్ని వారి మనసులోనుంచి తొలగించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపాలన్నదే విశ్యాశాఖ ఆలోచన.

విద్యతో పాటు ఫిజియోథెరపీ..

మాటలు రాని, మానసిక ఎదుగుదల లేని పిల్లలు, ఇళ్లలో ఉండి మరంత మానసికంగా కుంగిపోకుండా, వారిని గుర్తించి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించేలా సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ పిల్లలతో కలిసి బోధన జరిగేలా మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలు వారికి విద్యాబోధన అందిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యాకానుక కిట్లు వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, యోగా తదితర వాటిలో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు ఫిజియోథెరపిస్ట్‌ల పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుంది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు పాఠశాలలో చేరితే ప్రతి నెలా రూ.300లు రవాణా ఛార్జీలుగా ఇస్తారు. వినికిడి లోపం, దృష్టిలోపం, ఉన్న వారికి ట్యాబ్‌లతో పాటు తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం, ఏడాదికి రూ.9 వేలు నుంచి రూ.11 వేలు వరకు అందజేస్తారు. వైకల్యం శాతం అధికంగా ఉంటే చదవలేరని ధ్రువపత్రంతో పింఛన్ అందిస్తారు. బస్సు రైల్వేలో పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారికి ఇంటింటికి వెళ్లి బోధిస్తారు. ఇలాంటి వారు పాఠశాలకు రాకున్నా వచ్చినట్లే హాజరు వేస్తారు. ప్రత్యేక శిక్షణతో వారిని ఆయా తరగతులు ఉత్తీర్ణులు అయ్యేలా చేసి, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ కృషిచేస్తోంది.

అధైర్య పడొద్దు.. తోడుగా ఉంటాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: రాజకీయాల్లో ఏ పార్టీకీ అధికారం శాశ్వతం కాదని, గెలుపోటములు సర్వసాధారణమని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడొద్దని, ప్రతి ఒక్కరికీ తోడుగా ఉంటామని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన తనతో పాటు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావు తోడు గా ఉంటామని, ఏ అవసరం వచ్చినా తమను కలవచ్చని చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు చెప్పారు. పార్టీలకతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, అయితే వైఎస్సార్‌సీపీ కంటే ఇంకా ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామని కూటమి హామీ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారని చెప్పారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలను కూడా అమలు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీకి గ్రామస్థాయిలో మంచి ఓటు బ్యాంకు ఉందని, సుమారు 40శాతం ఓట్లు రావడమే అందుకు నిదర్శనమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మళ్లీ పుంజుకొని ముందుకు పోదామని పిలుపునిచ్చారు. డీసీబీసీ చైర్మన్ వేచలపు చిన రామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, నాయకులు దళ్ల మహేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో శనివారం సాయంత్రం పెదమానాపురం ఎస్‌ఐ శిరీష, పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లా డుతూ వాహన పత్రాలతో పాటు వాహన చోదకులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

గూడెం సొసైటీ చైర్మన్ రాజీనామా

గుర్ల: మండలంలోని గూడెం పీఏసీఎస్ చైర్మన్ రెడ్డి మురళీధరరావు తన పదవికి శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ వర్మకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సొసైటీ నుంచి సహకారం అందించామని తెలిపారు.

కోడ్ ముగిసినా ముసుగులు తీయరేం..?



రైల్వేస్టేషన్ వద్ద ప్రధాని మోదీ విగ్రహానికి ఉన్న ముసుగును చూపిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు నీలకంఠం

చీపురుపల్లి: దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ముగిసినా చీపురుపల్లిలో ఎన్నికల అధికారులకు మాత్రం ఇంకా కోడ్ ముగిసినట్లు లేదని బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం అన్నారు. శనివారం ఆయన పట్టణంలో పలువురు విగ్రహాలు, ఫొటోలపై ఇంకా ముసుగు లు తొలగించని విషయాన్ని స్థానిక విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 6 నాటికి దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ ముగిసిందన్నారు. అయిన ప్పటికీ చీపురుపల్లిలో అధికారుల దృష్టిలో మాత్రం ఇంకా కోడ్ కొనసాగుతోందన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విగ్రహా నికి ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పుడే ముసుగు వేశారని, ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తొలగించలేదని చెప్పారు. దేశ చరిత్రలో లేని విధంగా మూడోసారి ప్రధాని కాబోతున్న ఆయన విగ్రహానికి మసుగు తొలగించలేని పరిస్థితుల్లో అధికారులు ఉండడం దురదృష్టకరమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు చొరవ చూపించి ముసుగులు తొలగించాలని కోరారు.

ఆటవిడుపు



స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొడుతున్న విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక కేంబ్రిడ్జ్ నారాయణ, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరాల ముగింపు సందర్భంగా క్రీడాకారులు అందరిలో ఆటవిడుపుగా చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు ఉల్లాసం నింపారు. రెండు శిబిరాల్లో క్రీడాకారులు అందరినీ శనివారం ఎస్.కోట పట్టణంలోని శిరికి రిసార్ట్స్‌కు తీసుకెళ్లారు. క్రీడలు, వ్యాయామం ఎంత అవసరమో వివరించారు. మనిషికి వ్యాయామం, ఆటలతో పాటూ అదే స్థాయిలో ఆరోగ్యాన్ని ఇచ్చేది ఈత అని తెలియచెప్పి, క్రీడాకారులతో ఈతకొలనులో స్విమ్మింగ్ చేయించారు. అనంతరం క్రీడాకారులు అంతా చీఫ్‌కోచ్ శ్రీరాములుకు ధన్యవాదాలు చెప్పి, మళ్లీ తమ స్కూళ్లకు వెళ్లిపోతామని, వచ్చే ఏడాది సమ్మర్ క్యాంప్‌కు వస్తామంటూ వీడ్కోలు చెప్పారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రముఖులు

శిచీపురుపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆర్యసమాజం దయానంద వేదిక గురుకుల నిర్వాహకులు మువ్వ రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని కొత్తఅగ్రహారంలో గల ఆర్యసమాజంలో నిర్వహించిన యోగ శిబిరం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా వంద మందితో ఆర్యసమాజంలో గాయత్రీ హోమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లు, వ్యవసనాల జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలను పాటించాలన్నారు.రోజూ ప్రాణాయామం చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. చెడు అలవాట్లు జోలికి పోబోమని విద్యార్థుల తో ప్రతిజ్ఞ చేయించారు. యోగ శిబిరానికి హాజరైన వారికి నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనకా పల్లి సమీపంలో 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు నూతనంగా గురుకులం ఏర్పాటు చేశారని, ఆ పాఠశాలకు విద్యార్థులను పంపించాలని సూచించారు. బిస్వారాజాన ఆర్య, రామముని, భోజరాజు, కుమరాపు అప్పలనాయుడు, ఐ.సత్యనారాయణ, దన్నాన సత్యనారాయణ, దన్నాన శంకరరావు, ఐ.రమణ తదితరులు పాల్గొన్నారు.